క్లుప్తంగా

రేపు సంకటహర చతుర్థి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సత్య నారాయణపురం మారుతీ వ్యాయామశాల సమీపంలోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయంలో మంగళవారం సంకటహర చతుర్థి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కొమండూరి రఘురామ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం స్వామివారికి విశేషంగా పంచామృతాలతో అభిషేకం, సహస్ర నామార్చన పూజలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాల్సిందిగా ఆయన కోరారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్



విజయవాడరూరల్: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పనులు జరిగిన గ్రామాల్లో ఆదివారం సోషల్ ఆడిట్ జరిగింది. నున్న, పాతపాడు, జక్కంపూడి, గొల్లపూడి, ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల్లో స్టేట్ రిసోర్స్‌పర్సన్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్, విలేజి రిసోర్స్‌పర్సన్లు గ్రామాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. నున్న గ్రామంలో జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇంటి నిర్మాణం చేసుకున్న లబ్ధిదారులకు జాతీయ ఉపాధి పథకం కింద మంజూరైన గ్రాంట్‌కు సరిపడు చెల్లింపుల విషయంలో సోషల్ ఆడిట్ సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా మిగిలిన గ్రామాల్లో బిల్లు చెల్లింపులపై ఆడిట్ సిబ్బంది ఆరా తీశారు.

ముమ్మరంగా డ్రెయిన్లలో పూడికతీత పనులు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని పలు ప్రాంతాల్లో ఆదివారం సైడు కాలువల్లో సిల్టును పూడిక తీశారు. గ్రామంలోని జెండా చెట్టు సెంటర్, అను మై బేబీ హాస్పిటల్ సమీపంలో డ్రెయిన్లను మినీ జేసీబీతో పూడిక తీశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రత్యేక పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో సమస్యాత్మకంగా మారిన డ్రెయిన్లు గుర్తించి పూడిక తీస్తున్నామన్నారు. డ్రెయిన్లలో మురుగునీరు పారుదల సక్రమంగా లేకపోవడంతో ఈ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకం



హనుమాన్‌జంక్షన్ రూరల్: విశ్వశాంతి స్థాపనకై సత్య సాయిబాబా శత జయంతిని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్‌లో ఆదివారం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్‌లోని సత్య సాయిబాబా మందిరంలో వేకువజామున ఓంకార సుప్రభాత సేవ నిర్వహించిన తర్వాత చేపట్టిన నగర సంకీర్తన, శోభా యాత్రలో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం స్థానిక విజయవాడరోడ్డులోని సత్యసాయి సాద ప్రాంగణంలో గోపూజ, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. వచ్చే ఏడాది సత్య సాయిబాబా శత జయంతి సందర్భంగా 108 మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించ తలపెట్టగా, హనుమాన్‌జంక్షన్‌లో 84వ పూజా కార్యక్రమం పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పూజల అనంతరం మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ జరిగింది. సత్యసాయి సేవా సంస్థ మండల కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు, జిల్లా గ్రామసేవ సమన్వయకర్త గరికపాటి రామకృష్ణ, నందూరు సాయి వేణుగోపాల్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరులోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు ఆదివారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ప్రధాన గ్రామం, ఎస్సీ కాలనీ, రామానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

కమనీయం శ్రీనివాసుని కల్యాణం



నిత్య హోమాల్లో ఉభయదాతలు



సామూహిక కుంకుమార్చనలో మహిళలు

- ఘనంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు
- సామూహిక కుంకుమార్చన
- నిత్యహోమాల్లో ఉభయదాతలు
- స్వామివారికి ప్రత్యేక పూజలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీపద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. చిట్టినగర్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు నిత్య హోమాలు, సామూహిక కుంకుమార్చన, ఎదుర్కోలు ఉత్సవం, స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ఉభయదాతలు, భక్తులతో నిత్యహోమాలు చేశారు. ఆలయ అర్చకులు ఉభయదాతలతో హోమాలే జరిపించారు. అనంతరం స్వామి వారి



స్వామి వారికి విశేష అలంకరణ

ఆస్థాన కల్యాణ మండపంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించగా, పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పెళ్లికుమారుడు, పెళ్లికుమార్తెలుగా ముస్తాబైన శ్రీ పద్మావతి, గోదాదేవి, శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి భక్తులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

స్వామివారి సన్నిధిలో..

మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆదివారం శ్రీ వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వెలంపల్లి శ్రీనివాసరావును ఆలయ కమిటీ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. ఇరు దేవేరులతో స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరింపించుకున్నారు.

వైభవంగా కల్యాణం

వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఉత్సవాన్ని వీక్షించడానికిపెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉత్సవాలను దేవస్థాన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కమిటీ కార్యవర్గం, సభ్యులు పర్యవేక్షించారు.

ప్రజా దర్బార్‌కు 246 అర్జీలు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలపై ఆదివారం పోరంకి గ్రామంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో సమస్యలు వెల్లువెత్తాయి. ప్రజల నుంచి 246 అర్జీలు అందాయి. పోరంకిలో తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రజా దర్బార్ నిర్వహించారు. సంక్షేమ పథకాలకు, ఇంటి పన్నులు, టైటిల్ ట్రాన్స్‌ఫర్, అధిక ఇంటిపన్నులు, జరిమానాలు, తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీలు, పబ్లిక్ హెల్త్, టీడీఆర్ బాండ్లు, ఇళ్ల పట్టాలు, విద్యుత్ బిల్లులు, పోలీసు కేసులకు సంబంధించి వినతులు అందాయి. సమస్యలను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, దోనేపూడి రవి, రామ్‌కుమార్, గోపీచంద్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీతో పాటు భవన నిర్మాణ కార్మికుల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి కోరారు. ఈ మేరకు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బోడెకు వినతి పత్రం అందజేశారు. కార్మికులకు హెల్త్ అలవెన్స్, సమ్మె కాలంలో



పోరంకిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

జీతాలు, సంక్రాంతి పండుగకు బోనస్, చెత్త సేకరించే వాహనాల డ్రైవర్లను కాంట్రాక్టు రద్దు చేసి నేరుగా మున్సిపాలిటీనే జీతాలు ఇవ్వాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. తాడిగడప సెంటర్, ఉయ్యూరు, కంకిపాడు సెంటర్లలో మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఐద్వా నేతలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు మస్తాన్‌వలి, సరళ, ప్రసన్నలక్ష్మి, శంకర్, రత్నకరుణ, ఏడుకొండలు, ఐద్వా నాయకురాలు రమణమ్మ, వీరమ్మ, గంగమ్మ పాల్గొన్నారు.

పెనమలూరులో భారీ వర్షం

- పోరంకిలో నీట మునిగిన జాతీయ రహదారి
- స్తంభించిన జనజీవనం

పెనమలూరు: మండల పరిధిలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. డ్రెయినేజీలు పొంగటంతో విజయవాడ - మచిలీపట్నం జాతీయ రహదారిపై భారీగా వర్షం నీరు నిలిచిపోవటంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆదివారం రాత్రి ఒక్కసారిగా వర్షం కురవటంతో ప్రజలు ఉరుకులు పరుగులతో ఇళ్లకు చేరారు. భారీ వర్షం కారణంగా పోరంకి, కామయ్యతోపు, పప్పులమిల్లు ప్రాంతాల్లో వర్షం నీరు జాతీయ రహదారిపై భారీగా నిలిచి పోయింది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోరంకి సెంటర్‌లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వర్షం



పోరంకిలో బందరు రోడ్డుపైకి భారీగా చేరిన వర్షం నీరు

నీరుతో బందరు రోడ్డుపై మోకాలిలోతు నీరు నిలిచిపోయింది. ఈ ప్రాంతంలో వర్షం పడితే రోడ్డు మునిగిపోతుంది. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇకనైనా అధికారులు స్పందించి, నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉత్సాహంగా ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం పురస్కరించుకుని ఎన్టీఆర్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం విజయవాడలోని దుర్గాఘాట్‌లో అమరావతి బోటింగ్ క్లబ్ క్రూయిజ్‌లో నిర్వహించిన వేడుకలు ఉత్సాహభరితంగా జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని అధ్యక్షత వహించి మాట్లాడుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జాతీయ, ఆసియా క్రీడలకు రోయింగ్ క్రీడాకారులను పంపామని తెలిపారు. ఔత్సాహిక క్రీడాకారులైన విద్యార్థులకు వారి అభిరుచి మేరకు ఆటల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు పంపుతున్నామని చెప్పారు. క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. ముఖ్యఅతిథి ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌తో కలిసి జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు బి. నీహారిక (జాతీయ స్థాయి రెజ్లింగ్), వి.గీత (రాష్ట్ర స్థాయి రగ్బీ, రెజ్లింగ్), జాహ్నవి (స్టేట్ మీట్‌లో బాక్సింగ్, నేషనల్స్‌లో సైక్లింగ్), మోహన్ వంశీ (స్టేట్ మీట్‌లో బాక్సింగ్ ప్లేయర్), రోహిత్ కుమార్ (జాతీయ కుస్తీ)లను సత్కరించారు. అనంతరం ఒలింపిక్ బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అసోసియేషన్ తరఫున డాక్టర్ తరుణ్ కాకాని క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని కొనియాడారు. చదువుకుంటూనే క్రీడల్లో రాణించి దేశ కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కోలపల్లి గణేష్, శ్రీధర్, సంఘం నుంచి పవన్, బోస్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన పెరగాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగాహన పెంచుకోవాలని లయన్స్ క్లబ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షుడు, డాక్టర్ హనుమయ్య అన్నారు. శ్రీ సంభవనాథ్ రాజేంద్ర సూరిజైన్ శ్వేతాంబర్ ట్రస్ట్, శ్రీ సంభవనాథ్ జైన్ పరిషత్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ సంయుక్త ఆధ్వర్యాన పాతబస్తీలోని ఆరాధన భవన్‌లో రక్తదాన శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హనుమయ్య మాట్లాడుతూ రక్తదానంపై సమాజంలో అనేక అపోహలు ఉన్నాయన్నారు. రక్తం సకాలంలో అందక లక్షలాది మంది మృత్యువాత పడుతున్నారన్నారు. అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. క్లబ్ ప్రముఖులు తేజ్ రోజా సోలంకి మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాలు వయస్సు కలిగి, 50 కిలోల కన్నా అధికంగా బరువు ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. యువత ప్రతి మూడు మాసాలకొకసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు రాజేంద్రకుమార్ సోలంకి, సంపత్‌కుమార్, సుజిత్‌కుమార్ సోలంకి, డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

750 మందికి ఉచిత వైద్య పరీక్షలు



లబ్బీపేట(విజయవాడతూర్పు): పాయకాపురం విశాలాంధ్రకాలనీలోని ఎస్‌జీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో 750 మంది వైద్య పరీక్షలు చేశారు. సింగ్‌నగర్ ఫ్యామిలీ ఆస్పత్రి ఫిజీషియన్ డాక్టర్ సైరాభాను, వన్‌టౌన్‌లోని అయాన్ ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ బషీర్ అహ్మద్ మయూక్ వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సైరాబాను.. వైద్య బృందం సాధారణ వ్యాధులు, బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి వ్యాధులు ఉన్న వారికి 426 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందచేశారు. పలువురికి 25 రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేశారు. డాక్టర్ బషీర్ అహ్మద్ 320 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఐ డ్రాప్స్ ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సైరాభాను దోమకాటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్ కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ ఉప్పరపల్లి లక్ష్మీ రాజ్యపూర్ణ, అయాన్, ఫ్యామిలీ ఆస్పత్రిల గౌరవాధ్యక్షుడు వావిలాల రజనీకాంత్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులను దాతలు ఆదుకోవాలి

నున్న(విజయవాడరూరల్): పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ పిలుపునిచ్చారు. ప్రదీప్ ఫార్మ్స్ అధినేత ప్రదీప్ 70 మంది విద్యార్థులకు 5 లక్షల రూపాయలు ఉపకార వేతనాలు అందజేయడం అభినందనీయమని ప్రశంసించారు. నున్న గ్రామంలోని ప్రదీప్ ఫార్మ్స్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్, యువ హీరోలు రామ్, హరి విచ్చేసి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ.. లయోల కళాశాలలో విద్యనభ్యసించిన ప్రదీప్ కోళ్ల పెంపకం వ్యాపారాన్ని ప్రారంభించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రదీప్ ఫార్మ్స్ ఫౌండేషన్ పేరుతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. అనంతరం ప్రదీప్ ఫార్మ్స్ అధినేత



స్కాలర్‌షిప్ పంపిణీ చేస్తున్న ప్రదీప్, ఫాదర్ కిషోర్

ప్రదీప్ మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పరికరాలతో పాటు 70 మంది విద్యార్థులకు రూ.5 లక్షల స్కాలర్ షిప్‌లను అందజేస్తున్నానన్నారు. త్వరలో 100 మందికి పైగా విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేస్తానని చెప్పారు. తాను సంపాదించిన దానిలో 10 శాతం నిధులు పేద విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేయాలనే ఆలోచనతో ఈ కార్యక్రమం చేపట్టానన్నారు. కార్యక్రమంలో బెజవాడ మోహన్, స్పందన తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే యార్లగడ్డను కలిసిన హెచ్‌ఎంలు

గన్నవరం: ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును ఆదివారం జెడ్పీ హైస్కూల్స్ ప్రధానోపాధ్యాయుల సంఘ నేతలు విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. అనంతరం హెచ్‌ఎంలతో సమావేశమైన యార్లగడ్డ మాట్లాడుతూ.. విద్య రంగం అభివృద్ధికి ప్రభుత్వ పరంగానే కాకుండా తన వంతు సాయం అందిస్తానని చెప్పారు. ఎప్పుడు ఏ అవసరం వచ్చిన తనను సంప్రదించాలని సూచించారు. హెచ్‌ఎంల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.ఎస్.జగదీశ్వరరావు, అధ్యక్షుడు వైఎస్ఎన్.ప్రసాద్, కార్యదర్శి కె.విజయ, సభ్యులు టి.వి.నాగేశ్వరరావు, కె.కృష్ణమోహన్, డి.ఝాన్సీలక్ష్మి, కె.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను అడ్డుకోవాలని ఆదేశం..

విమానాశ్రయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ లెప్రసీ ఆస్పత్రి స్థలంలో జరుగుతున్న అక్రమ కట్టడాలను వెంటనే అడ్డుకోవాలని రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు. లెప్రసీ ఆస్పత్రి, లెప్రసీ కాలనీ అవసరాల



యార్లగడ్డకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న హెచ్‌ఎంలు

నిమిత్తం జమిందారు దానం చేసిన భూమిలో ఇటీవల అక్రమ కట్టడాలు చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న యార్లగడ్డ అక్రమణలను అడ్డుకోవాలని తహసీల్దారు పవన్‌కుమార్‌ను ఆదేశించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులకు సూచించారు. దీంతో రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను నిలిపివేసి సదరు భూమికి సంబంధించిన రికార్డులను తీసుకురావాలని సదరు నిర్మాణాలు చేస్తున్న వ్యక్తులకు సూచించారు.

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్.కిషోర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం క్రీడా ప్రాంగణంలో వాకర్స్ అసోసియేషన్ తొలి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ.. క్రీడా మైదానం అభివృద్ధికి ఇప్పటికే రూ.4.50 లక్షలు సొంత నిధులు వెచ్చించామన్నారు. ఇంకా వాకింగ్ ట్రాక్ బలోపేతంతో పాటు నూతనంగా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌కు ప్లాట్‌ఫామ్, రక్షణ వలయం ఏర్పాటు చేయాలని చెప్పారు. వీటి నిర్మాణానికి అవసరమైన సహకారం వాకర్స్‌తో పాటు సేవా భావం కలిగిన దాతలు తోడ్పాటునందించాలని కోరారు. జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌసాని, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టీఎస్ఆర్‌కె.ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ లోయ సురేంద్ర, కోశాధికారి బొకినాల కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శి ధనియాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.05 లక్షలు విరాళం

క్రీడా ప్రాంగణం అభివృద్ధికి పలువురు దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రూ.1.05 లక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్

విరాళం అందజేశారు. వీరిలో టీఎస్ఆర్‌కె.ప్రసాద్ రూ.25 వేలు, న్యాయవాది తిరివీధి వెంకయ్య, షేక్ సైపుద్దీన్, వెలివెంటి శివాజీ ఒక్కొక్కరు రూ.10 వేలు చొప్పున రూ.30 వేలు అందించారు. అదే విధంగా సగ్గుర్తి శ్రీనివాసరావు, జున్ను నారాయణరావు, ముక్కామల సుబ్బారావు, పీఎస్ఎస్ఎన్.శ్రీనివాస్, వీరంకి శ్రీనివాసరావు, బి.బ్రహ్మారెడ్డి, లక్ష్మీనారాయణ, వాలీబాల్ క్రీడాకారులు, ధనలక్ష్మి ల్యాబ్ ప్రసాద్, పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ హెడ్ ఎలీషా ఒక్కొక్కరు రూ. 5 వేలు చొప్పున రూ.50 వేలు ప్రకటించారు. వీరిందరికి అసోసియేషన్ అధ్యక్షుడు కిషోర్ కృతజ్ఞతలు తెలిపారు.

శాస్త్రోక్తంగా లక్ష్మీగణపతి, చండీ హోమాలు

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు శ్రీభువనేశ్వరి పీఠంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పలు హోమాలు నిర్వహించారు. తొలుత పీఠాధిపతులు కమలానందభారతిస్వామి ఆధ్వర్యంలో శ్రీభువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సమాఖ్య గౌరవ అధ్యక్షుడు యామిజాల నరసింహమూర్తి నేతృత్వంలో లక్ష్మీగణపతి, చండీ, రుద్ర, సుదర్శన హోమాలను శాస్త్రోక్తంగా జరిపారు. వందలాది మంది పురోహితులు, వేద పండితులు, అర్చకులు ఈ క్రతువులో పాల్గొన్నారు. అనంతరం టీడీపీ నాయకులు టి.వి.జనార్దన్, అశోక్‌బాబు, బుచ్చి రాంప్రసాద్ పాల్గొన్ని పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా యామిజాల మాట్లాడుతూ.. దేశ ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ ఈ హోమాలు నిర్వహించామన్నారు. కేంద్రం, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన నూతన ప్రభుత్వాలు జనరంజక పాలన



పూర్ణాహుతి సమర్పిస్తున్న కమలానందభారతిస్వామి తదితరులు

సాగించాలని, విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను అందరికీ కల్పించాలని వేడుకున్నట్లు తెలిపారు. వివిధ పురోహిత, బ్రాహ్మణ సంఘాలకు చెందిన పాదిలి నారాయణమూర్తి, సత్మవాడ దుర్గాప్రసాద్, రామరాజు, యణమండ్ర సురేష్, కపిలవాయి రామశాస్త్రి సోమయాజీ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద చిన్నారులకు నిత్యావసరాల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): అనాథ, నిరుపేద చిన్నారులకు ఆదివారం హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగమల్లీశ్వరి, షఫీ మాట్లాడుతూ తమ వంతు బాధ్యతగా నిరుపేద చిన్నారులకు దాతలు, ట్రస్ట్ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. ట్రస్ట్ సేవలను సద్వినియోగం చేసుకుని చిన్నారులు జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ మాట్లాడుతూ ట్రస్ట్ సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

కాలుష్యం కోరల్లో రామయ్య చెరువు



కాలుష్య కాసారంగా మారిన రామయ్య చెరువు

విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని రామయ్య చెరువు కాలుష్యం కోరల్లో చిక్కుకుంది. సుమారు 3.86 ఎకరాల విస్తీర్ణంలో ఈ చెరువు ఉంది. కొన్నేళ్లుగా సమీప ప్రాంతాలతో పాటు అపార్టుమెంట్ల ద్వారా వచ్చే మురుగును ఈ చెరువులోనే కలుపుతున్నారు. చెరువు చుట్టూ చెత్త, వ్యర్థాలు పెరిగిపోవడం వల్ల నిత్యం తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది. పందులు, కుక్కలు నివాసాల మధ్య సంచరిస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి చెరువును ప్రక్షాళన చేయాలని, చెత్త కుప్పలను డంపింగ్ యార్డ్‌కు తరలించి చెత్త సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– రామవరప్పాడు



కాలువ ద్వారా చెరువులోకి వెళ్తున్న మురుగు నీరు

నేటి నుంచి వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే

నున్న(విజయవాడరూరల్): ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, ఇంటింటా సర్వే నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఆదేశాలు జారీ చేశారు. అనుమానిత డయేరియా, మలేరియా, డెంగీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్య పరీక్షల ఫలితాల ఆధారంగా వెంటనే వారికి చికిత్సను అందించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. వ్యాధులు నిర్ధారణ అయితే వారికి వెంటనే వైద్యసేవలందించి, ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలంలో ఇంటింటి సర్వే నిరంతరం నిర్వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు అందాయి.